సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్ చర్చి లేన్‌లో మంగళవారం స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ కంది శైలజ సీసీ రోడ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. అదే విధంగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కంది నారాయణ, జగదీష్, రాజేష్, జీహెచ్‌ఎంసీ డీఈ రఘు, ఏఈ కౌశిక్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలు సరికాదు

సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోట నీలిమ


సమావేశంలో మాట్లాడుతున్న కోట నీలిమ

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగణనపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరికాదని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు.మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కులగణను తప్పుపట్టేలా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారన్నారు.ప్రభుత్వం చేస్తున్నది కేవలం కులగణన పాత్రమే కాదని, అది కుటుంబ సమగ్ర సర్వే అని తెలిపారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి

సనత్‌నగర్: అమీర్‌పేట డివిజన్‌లో గల ముస్లిం బస్తీలోని అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీనిచ్చారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన ముస్లిం బస్తీ కమిటీ సభ్యులు మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. బస్తీలో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. బస్తీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నూతన అధ్యక్షుడు నసీరుద్దీన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అంజద్, ప్రధాన కార్యదర్శి నిసారుద్దీన్, సలహాదారు సయ్యద్ అథిక్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: హుస్సేన్ సాగర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సెక్రటరియేట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం మంగళవారం ఉదయం రోటరీ ప్రాంతంలోని జలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి వెలికితీశారు. మృతుడి వయసు 32 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై నీలం రంగు చొక్కా, ఆలీవ్ గ్రీన్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు.

పీడీఎస్ బియ్యం నిలువ చేసిన ఇద్దరి అరెస్టు

రాంగోపాల్‌పేట్: 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన ఇద్దరు నిందితులను గాంధీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఎండీ ముజాహెద్ హుస్సేన్ (24), భోలక్‌పూర్ బంగ్లాదేశ్ మార్కెట్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అలాగే ముషీరాబాద్ ఇంద్రానగర్‌కు చెందిన మహ్మద్ గౌసుద్దీన్ (19)ఇంట్లో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నిలువ చేశారు. ఈ బియ్యాన్ని ఇతరులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు నిందితుల నుంచి బియ్యాన్ని స్వాధీనం చేకున్నారు.

యువతి ఆత్మహత్య..

సనత్‌నగర్: అనుమానాస్పదస్థితిలో ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపిన మేరకు.. రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి గుంజరి విఠల్ కుమార్తె స్రవంతి (19) మారేడ్‌పల్లి కస్తూర్బా కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 11న ఇంట్లో అందరూ బయటకు వెళ్లారు. రాత్రి తిరిగి 11.30 గంటల సమయంలో రాగా స్రవంతి ఫ్యాన్‌కు చీరతో వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంటి పక్కనే ఉండే సురేష్ అనే యువకుడు వేధింపులకు గురిచేసేవాడని, అప్పుడప్పుడు డబ్బులు డిమాండ్ చేసి తీసుకునేవాడని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తిరిగి డబ్బులు ఇవ్వమని తన కుమార్తె అడగడంతో ఇవ్వకుండా పలు విధాలుగా వేధింపులకు గురిచేయడం వల్లనే ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పార్కును పట్టించుకోండి

నిర్వహణ అధ్వానం

- అస్తవ్యస్తంగా మెట్టుగూడ పార్కు నిర్వహణ
- పార్కులో ప్రైవేటు వ్యక్తుల సామగ్రి
- నిరుపయోగంగా ఓపెన్ జిమ్ పరికరాలు



సికింద్రాబాద్: మెట్టుగూడ ప్రాంత ప్రజలకు ఎంతో వినియోగంగా ఉన్న ఉమామహేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని జీహెచ్‌ఎంసీ పార్కు క్రమేణా ఎందుకు పనికి రాకుండా పోతోంది. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా పార్కు స్థలం కాస్త స్క్రాప్ గోడౌన్‌గా మారుతుంది. అందులో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ఓపెన్ జిమ్ పరికరాలు కూడా తుప్పుపట్టి పోతున్నాయి. దశలవారీగా మైదానం ప్రైవేటు వ్యక్తుల స్థలంగా మారిపోతుండడం, చెత్తచెదారాలకు నిలయంగా మారుతుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి వ్యయప్రయాసల పాలవుతున్నారు.

పేదలే అధికం...

మెట్టుగూడ ప్రాంతంలో బస్తీల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇందులో మొత్తంగా పేద మధ్యతరగతి ప్రజలు నివసిస్తున్నారు. వీరు తమ ఇండ్లలో ఏ శుభకార్యం జరిగినా జీహెచ్‌ఎంసీ మైదానాన్ని ఆశ్రయించేవారు. ఎంచక్కా టెంట్‌లు వేయించుకుని రెండు మూడు వందల వరకు అతిథులను ఆహ్వానించి శుభకార్యాలు చేయించుకునేవారు. క్రమేణా జీహెచ్‌ఎంసీ నిర్వహణ బాధ్యతలు వదిలేయడంతో మైదానం రూపురేఖలు మారిపోయాయి.

స్క్రాప్ నిల్వలు

మైదానంలో ఒకవైపు బయట శుభకార్యాలకు డెకరేషన్ వ్యాపారాలు చేసుకునే వ్యక్తులు తమ సామాగ్రిని పార్కు మైదానంలో నిల్వ ఉంచుతున్నారు. మరోవైపు ఈ ప్రాంతానికి చెందిన మరికొందరు పాత సామాన్లను మైదానంలోకి తెచ్చిపెట్టారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఎంతమాత్రం పట్టించుకోని కారణంతో కొంత మంది స్థానికులు తమ అవసరాలకు మాత్రమే పార్కు గేటును ఓపెన్ చేసి ఆ తరువాత తాళం వేసుకుంటున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వారా మెట్టుగూడ పార్కు మైదానానికి పూర్వ వైభవం తేవాలని స్థానికులు కోరుతున్నారు. పార్కు స్థలంలో నిల్వలు ఉంచిన ప్రైవేటు వ్యక్తుల వస్తువులు బయటకు తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మైదానం నిర్వహణను జీహెచ్‌ఎంసీ సిబ్బంది పరిధిలోకి తెచ్చి శుభకార్యాలు నిర్వహించేందుకు, జిమ్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.


నిరుపయోగంగా పిల్లల జిమ్ పరికరాలు.

నిరుపయోగంగా జిమ్....

ఈ ప్రాంత పిల్లలు సాయంత్రం వేళల్లో ఆటలు ఆడుకునేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిధులతో మెట్టుగూడ పార్కు మైదానంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయించారు. పార్కు మైదానంలోనికి ప్రవేశాలపై ప్రైవేటు వ్యక్తుల ఆంక్షలు అపధికారికంగా అమలవుతున్న నేపథ్యంలో పిల్లలు ఎవరు పార్కుకు రావడం లేదు. ఫలితంగా జిమ్ పరికరాలు తుప్పు పట్టిపోతున్నాయి. శుభాకార్యాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన వేదిన కూడా శిథిలం అవుతుండడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి

లాలాపేట: ప్రతి ఒక్కరూ తోటి వారిపట్ల సేవాభావాన్ని అలవర్చుకోవాలని అరుణోదయ ఓల్డేజ్ హోమ్ చైర్మెన్ తాళ్ల లావణ్య అన్నారు. మంగళవారం ఓల్డేజ్ హోంలోని వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. వారితో పాటు కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మాతృదేవో భవ సత్సంగ్ జాతీయ అధ్యక్షులు శ్రీధర్,ఆయుర్వేద స్పెషలిస్టు డా. లక్ష్మీ, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ పందిల్ల రవికుమార్ హోం సెక్రటరీ చిన్నా యాదవ్, ప్రియాంక్ తదితరులున్నారు.

లాలాగూడ ఎస్‌హెచ్‌ఓగా రఘు బాబు



రఘు బాబు, ఇన్‌స్పెక్టర్

అడ్డగుట్ట: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు హెచ్చరించారు. లాలాగూడ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా రఘు బాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి సీసీఎస్‌డీడీ కి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సీసీఎస్‌డీడీ నుంచి రఘుబాబు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

టీజీపీసీబీ ఉద్యోగుల నిరసన



సనత్‌నగర్: వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బందిపై దాడికి నిరసనగా మంగళవారం టీజీపీసీబీ ప్రధాన కార్యాలయ ఉద్యోగులు నిరసనకు దిగారు. వికారాబాద్ జిల్లాలో ఫార్మా సిటీ ఏర్పాటుచేయడానికి తీసుకున్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా జరిగిన భూసేకరణ సమావేశంలో జిల్లా కలెక్టర్‌పై దాడి చేయడం హేయకరమని ఈ సందర్భంగా ఉద్యోగులు పేర్కొన్నారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీవాత్సవ, ప్రధాన కార్యదర్శి కృపానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై జరిగిన దాడిని ఖండించారు.

ఘనంగా రాష్ట్రీయ ఏక్తా పర్వ్


పికెట్ కేవీ సంఘటన్‌లో పాల్గొన్న రీజనల్ అసిస్టెంట్ కమిషనర్ అనూరాధ తదితరులు

రసూల్‌పురా: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతుత్సోవాలను పురస్కరించుకుని కంటోన్మెంట్‌లోని వివిధ కేంద్రీయ విద్యాలయ పాఠశాలల్లో రాష్ట్రీయ ఏక్తా పర్వ్ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పికెట్ కేంద్రీయ విద్యాలయంలో దేశ వ్యాప్తంగా ఉన్న 25 రీజియన్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు శాస్త్రీయ సంగీత పాటల పోటీల్లో, వాయిద్య సంగీత ప్రదర్శనల్లో పాల్గొని వారి ప్రతిభను కనబర్చారు. మారేడుపల్లిలోని భక్త రామదాసు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రొఫెసర్లు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ రీజనల్ అసిస్టెంట్ కమిషనర్ పి.అనురాధ, ప్రిన్సిపల్ రూపేందర్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తిరుమలగిరి కేవీ సంఘటన్‌లో పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో విభిన్న సాంస్కృతి వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ ప్రదర్శనలిచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య..

సనత్‌నగర్: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..రసూల్‌పురా ఇందిరమ్మనగర్ హనుమాన్ టెంపుల్ సమీపంలో నివాసం ఉండే ఆనంద్ (38) మంగళవారం ఉదయం ఎంతకీ తలుపు తీయకపోవడంతో సోదరుడు రవి తలుపు గడియ పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. అప్పటికే ఆనంద్ మృతి చెందినట్లు తెలుసుకున్న ఆయన బేగంపేట పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఆనంద్‌కు భార్య మహేశ్వరి, ముగ్గురు పిల్లలు వినయ్, గౌతమి, తన్విక్ ఉన్నారు.

యూజీసీ న్యాక్ గుర్తింపునకు కృషి చేద్దాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు యూజీసీ న్యాక్ ఎ ప్లస్ గుర్తింపునకు కృషి చేయాలని, అందుకు అందరూ సహకరించాలని వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో అధ్యాపకుల మొదటి సమావేశంలో మాట్లాడారు. ఓయూలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

బల్కంపేట ఎల్లమ్మకు ఆకాశ దీపం



సనత్‌నగర్: డీఎస్పీ వంశీమోహన్‌రెడ్డి బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆయన ప్రత్యేకంగా తయారుచేయించిన ఆకాశ దీపాన్ని విరాళంగా అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయన ఆకాశ దీపాన్ని ఆలయ పండితులకు అందజేశారు. ఈ సందర్భంగా వంశీ మోహన్‌రెడ్డిని వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. శివాజీనగర్‌లోని శివాజీ విగ్రహం నుంచి ఎస్సార్టీ క్వార్టర్స్ వరకు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. సాధ్యమైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, బుచ్చిలింగం పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోనే మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థ

- ఏసీపీ సంపత్‌కుమార్



ట్రాఫిక్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ సంపత్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాంబాబు

లాలాపేట : ఒక్క రోజులో పడిన కష్టంలో కనీసం ఒక్క చిన్న ప్రమాదం జరగకుండా తప్పించినా తమ ఉద్యోగం తమకు ఎంతో సంతృప్తి నిస్తుందని ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసిపి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం తార్నాక శ్రీచైతన్య పాఠశాల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ ముఖ్యతిధిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. తార్నాక చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు.నల్లకుంట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాంబాబు, చైతన్య స్కూల్ నారాయణగూడ జోన్ ఏజీఎం మొగల్ నూర్ మహ్మద్ అలీ పాల్గొన్నారు.

ఓయూలో పుస్తక సమీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో మంగళవారం పుస్తక సమీక్ష జరిగింది. న్యాయకళాశాల విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్ కుమార్ రచించిన నార్త్ సౌత్ ఇన్ బ్యాలెన్స్ గ్లోబల్ అనే పుస్తకం సమీక్ష జరిగింది. కార్యక్రమానికి పీహెచ్‌డీ విద్యార్థి కంచర్ల బద్రీ అధ్యక్షత వహించగా ఆర్ట్స్ కాలేజీ ఇంగ్లీష్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ రావు పుస్తకం గురించి విశ్లేషించారు. కార్యక్రమంలో పుస్తక రచయిత ప్రొ.గాలి వినోద్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు మాతంగి ఓదేలు, న్యాయవాది గడ్డం అశోక్, గోపాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై డిప్యూటీ మేయర్ సమీక్ష


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని ఐదు మున్సిపల్ డివిజన్‌లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మంగళవార డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రోడ్ల మరమ్మతులు, మట్టి రోడ్ల స్థానంలో బీటీ రోడ్ల నిర్మాణం, మురుగు నీటి నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. తీసుకోవాల్సిన చర్యలపై డిప్యూటీ మేయర్ ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు వెంకటరాజు, సువర్ణ, ఏఈలు వేణు, కౌషిక్, లావణ్య పాల్గొన్నారు.

బోర్డులో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యమే లేదు

- రక్షణ శాఖ డైరెక్టర్‌కు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్


రక్షణ శాఖ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలైనా నిర్వహించండి, లేదా జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలంటూ ఎమ్మెల్యే శ్రీగణేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కంటోన్మెంట్‌ను సందర్శించిన రక్షణ శాఖ సదరన్ కమాండ్ డైరెక్టర్ ప్రసాద్ చౌహాన్‌ను, పలువురు కంటోన్మెంట్ వాసులతో పాటు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు చివరిసారిగా 2015 జనవరిలో ఎన్నికలు జరిగాయన్నారు. బోర్డు సభ్యులు సాధారణ పదవీకాలం 2020లోనే పూర్తయినప్పటికీ, ఏడాది పాటు పొడిగింపు అవకాశం కల్పించారని అన్నారు. నాలుగేళ్లుగా బోర్డులో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యమే లేదన్నారు. కేంద్రం ఇప్పటికైనా ప్రజస్వామ్యాన్ని రక్షించేలా బోర్డు ఎన్నికలు నిర్వహించాలన్నారు. మూడేళ్లుగా కంటోన్మెంట్‌లో ఒక రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడి కొనసాగడం కూడా సరికాదన్నారు.

రెండు రోజులకోసారి నీటి సరఫరా చేయాలి

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో తాగునీటి సమస్యను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రోజులకు 10 లక్షల గ్యాలన్ల అదనపు నీటిని సరఫరా చేస్తోందన్నారు. అదనపు నీటికి సైతం కిలో లీటరుకు రూ.13 మాత్రమే బిల్లు వసూలు చేసేలా జలమండలిని ఒప్పించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అదనపు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో కంటోన్మెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా చేయాలని బోర్డు అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి, మెజారిటీ ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు.

కమర్షియల్ 'బంగళా'లపై చర్యలేవీ?

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో కేవలం నివాస అవసరాల నిమిత్తం కేటాయించిన పలు ఓల్డ్ గ్రాంట్ బంగళాలను, కబ్జాదారులు దొడ్డిదారిన కమర్షియల్‌గా వినియోగిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీరిపై బోర్డు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడంతో పాటు, కమర్షియల్ కార్యకలాపాలకు సంబంధించి పన్నులు కూడా వసూలు చేయాలన్నారు.

సర్వే.. వెరీ స్లో..

- ఇంకా ఊపందుకోని సర్వే..
- పలుచోట్ల వ్యతిరేకత..
- అక్కడక్కడా అపార్ట్‌మెంట్లలోకి ఎన్యుమరేటర్లను అనుతించని వైనం..
- బేగంపేట సర్కిల్‌లో కేవలం 4,800 కుటుంబాల సర్వే


ఎన్యుమరేటర్లతో సమావేశమైన బేగంపేట సర్కిల్ స్పెషల్ ఆఫీసర్ యాదగిరి, డీఎంసీ సమ్మయ్య

సనత్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఇంకా ఊపందుకోలేదు. పలు అపార్ట్‌మెంట్ల నివాసితుల నుంచి సర్వేపై వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో పాటు తాము వివరాలు ఇవ్వబోమంటూ ఎన్యుమరేటర్ల ముఖం పైనే చెప్పేస్తున్నారు. కొన్ని అపార్ట్‌మెంట్లలోకి అసలు ఎంట్రీనే కల్పించకపోవడం గమనార్హం. తద్వారా సర్వే ప్రక్రియ వేగవంతంగా జరగడం లేదనే సుస్పష్టం. బేగంపేట సర్కిల్ పరిధిలో 64,730 కుటుంబాలకు గాను 62,431 కుటుంబాలకు స్టిక్కర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఇకా 2,299 కుటుంబాలకు చెందిన ఇంటి నెంబర్, కుటుంబ యజమాని, ఫోన్ నెంబర్ వంటి వివరాలు సేకరించలేదు. దీంతో ఆయా ఇళ్లకు స్టిక్కర్ల అతికించే ప్రక్రియ జరగలేదు. ఈ నెల 6న ప్రారంభమైన సర్వేలో భాగంగా మొదటి దశ కింద మొదటి మూడు రోజులు స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి. అలాంటిది స్టిక్కర్లు అంటించాల్సిన ఇళ్లు ఇంకా మిగిలి ఉన్నాయి. ఇక ఈ నెల 9 నుంచి ప్రారంభమైన పూర్తి స్థాయి వివరాల సేకరణ ప్రక్రియ విషయానికొస్తే ఎన్యుమరేటర్లకు అసలు కష్టాలు ఇప్పుడు మొదలయ్యాయి. బేగంపేట సర్కిల్ పరిధిలోని బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్ల వ్యాప్తంగా 432 మంది ఎన్యుమరేటర్లను ఈ సర్వే కోసం నియమించారు. ఒక్కొక్కరు రోజుకు 10 ఇళ్ల చొప్పున సర్వే చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన రోజుకు నాలుగు వేలకు పైగా ఇళ్ల పూర్తి స్థాయి సర్వే చేయాలనే లక్ష్యంగా పెట్టారు. కానీ మొదటి దశ పూర్తి చేసుకుని రెండో దశ ప్రారంభమై నాలుగు రోజులు గడిచినా కూడా ఇప్పటివరకు బేగంపేట సర్కిల్‌లో 4,800 కుటుంబాల సర్వే మాత్రమే పూర్తి చేశారు.

చాలాచోట్ల సర్వేపై అనాసక్తి..

చాలాచోట్ల అపార్ట్‌మెంట్లలోకి అనుమతించడం లేదని ఎన్యుమరేటర్లు మంగళవారం బేగంపేట సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉన్నతాధికారులతో మొరపెట్టుకుంటున్నారు. ముఖ్యంగా బేగంపేటలోని వెల్కిన్ అపార్ట్‌మెంట్స్, మారేడ్‌పల్లిలోని కొన్ని అపార్ట్‌మెంట్స్‌ల్లోకి ప్రవేశం కూడా కల్పించడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే చాలాచోట్ల సర్వేలో ఆస్తిపాస్తులు, ధరణి, బ్యాంక్ వివరాలు, వ్యవసాయ భూముల వివరాలు తెలిపేందుకు ఇష్టపడడం లేదని, ఇవన్నీ మీకు ఎందుకంటూ ఎదురు ప్రశ్నిస్తున్నట్లు ఎన్యుమరేటర్లు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. మారేడ్‌పల్లిలో ఓ అపార్ట్‌మెంట్‌లో అయితే ఏకంగా కుక్కలను వదులుతున్నారని ఎన్యుమరేటర్ల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. కులం కావాలంటే చెబుదాం..అది చెబుతాం..తెలుసుకుని వెళ్లండంటూ కొంతమంది ఖరాఖండీగా చెబుతున్నట్లు పేర్కొంటున్నారు.

త్వరితగతిన సర్వే పూర్తి చేయండి

బేగంపేట సర్కిల్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లతో నిర్వహించిన సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ యాదగిరి వారికి దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు సర్వేను సాఫీగా నిర్వహించాలన్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు 10 ఇళ్ల చొప్పున పూర్తిస్థాయి సర్వే చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సర్వేపై అపోహలు ఉంటే సావధానంగా వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్యుమరేటర్లపై ఉంటుందన్నారు. లక్ష్యాన్ని చేరుకునే విధంగా ఎన్యుమరేటర్లు సర్వే ప్రక్రియను ముందుకుతీసుకువెళ్లాలని సూచించారు.
స్పెషల్ ఆఫీసర్ యాదగిరి